ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

- భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- వినాయక చవితి ఏర్పాట్లపై సమీక్షా సమావేశం

కూకట్‌పల్లి: అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో భక్తులకు ఇబ్బందులు లేకుండా నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌తో కలిసి గురువారం వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వినాయక చవితి ఉత్సవాల్లో రంగధాముని చెరువు వద్ద 7 క్రేనులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎలక్ట్రిసిటీ వారు ఎటువంటి ఆటంకాలు లేకుండా లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. నిమజ్జన సమయంలో వాహనాల పార్కింగ్ కోసం ప్రైవేట్ స్థల యజమానులతో మాట్లాడి పార్కింగ్‌కు స్థలాన్ని ఇప్పించే ప్రయత్నం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. శానిటేషన్ అధికారులు, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి రోజు శానిటేషన్‌పై పర్యవేక్షణ చేయాలని సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరారు. సమావేశంలో కార్పొరేటర్‌లు సబిహా బేగం, మహేందర్, అధికారులు పాల్గొన్నారు.


సమీక్షలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులు తదితరులు

సమయానికి రారు..
వైద్యం చేయరు


వైద్యులు సకాలంలో రాకపోవడంతో కళ్లుతిరిగి పడిపోయిన పేషెంట్


ఎల్లమ్మబండ బస్తీ దవాఖానలో వేచి చూస్తున్న రోగులు

- బస్తీ దవాఖానాలో అందుబాటులో లేని వైద్యులు
- సమయానికి రాక రోగుల తిప్పలు
- ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వేడుకోలు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఎల్లమ్మబండ బస్తీ దవాఖానకు స్థానికంగా ఉన్న బస్తీలు, కాలనీలలోని పేద, మధ్య తరగతి ప్రజలు చికిత్స కోసం వస్తుంటారు. వైద్యులు సమయానికి రాకపోవటం, వచ్చినా రోగులకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఉదయం 9 గంటలకు రావాల్సిన వైద్యులు 11 గంటలకై నా అందుబాటులోకి రాకపోవటంతో.. చికిత్స కోసం వచ్చే వారు నీరసించి కళ్లు తిరిగి పడిపోతున్నారు. కనీసం ప్రథమ చికిత్సనైనా చేసే వారు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు. బీపీ, షుగర్ ఉన్న రోగులు అస్వస్థతకు గురై తప్పనిసరి పరిస్థితిలో ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తున్నదని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. బస్తీ దవాఖానలో బ్లడ్ శాంపిల్స్ ఇస్తే మరుసటి రోజు వరకు కూడా రిపోర్టు ఇవ్వటం లేదని, చెప్పులు అరిగేలా తిప్పించుకుంటున్నారని పలువురు పేర్కొన్నారు. ఇప్పటికై నా సంబంధిత ఉన్నతాధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు బస్తీ దవాఖానలపై ప్రత్యేక దృష్టి సారించి వైద్యులు, సిబ్బంది సకాలంలో హాజరై సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

> రోగం వస్తే ప్రభుత్వ ఆసుపత్రిని నమ్ముకునే పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రాణ సంకటంగా మారుతోంది. అసలే వర్షాకాలం సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో అనేక మంది డెంగీ, మలేరియా వంటి విష జ్వరాలతో బాధపడుతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లలేక బస్తీ దవాఖానకు వెళితే వైద్యులు సమయానికి రాకపోవడంతో రోగులు కళ్లు తిరిగి పడిపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వైద్యులు సమయానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

11 గంటలకైనా వైద్యులు రాలేదు



ఉదయం, సాయంత్రం వేళల్లో వైద్యులు అందుబాటులో ఉండటం లేదు. మా కుటుంబ సభ్యులను ఆసుపత్రికి ఉదయం 9 గంటలకు తీసుకుశ్తే 11:30 గంటలైనప్పటికీ కూడా బస్తీ దవాఖానలో వైద్యులు అందుబాటులో లేరు. బ్లడ్ శాంపిల్స్, రిపోర్టు సమయానికి అందించటం లేదు. ఉన్నతాధికారులు స్పందించి సమయానికి రాని వైద్యులపై చర్యలు తీసుకోవాలి.
– శ్రీనివాస్, ఆల్విన్‌కాలనీ నివాసి

ఆలయ వార్షికోత్సవ పూజలు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్ 9వ ఫేజ్‌లోని విజయ గణపతి ఆలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. గురువారం కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు దంపతులు మండప దేవత హోమం, పూర్ణాహుతి, వసంతోత్సవం తదితర పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.


పూజలో కార్పొరేటర్ శ్రీనివాసరావు దంపతులు

పగిలిన మ్యాన్‌హోళ్ల మూతలను మార్చాలి


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ బాబూరావు తదితరులు

మూసాపేట: డివిజన్ పరిధిలో పగిలిన మ్యాన్‌హోళ్ల మూతలను మార్చాలని మాజీ కార్పొరేటర్ బాబూరావు అన్నారు. బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని ప్రగతినగర్‌లో వసుంధర ఆసుపత్రి సమీపంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా గోపాల్, భాస్కరరావు, శారద తదితరులు పాల్గొన్నారు.


కవుల వేషధారణలో ఆకట్టుకున్న విద్యార్థులు

మూసాపేట: మూసాపేటలోని పంచశీల స్కూల్‌లో గురువారం తెలుగుభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు తెలుగుతల్లి, కవులు తిక్కన్న, ఎర్రన్న, గిడుగు రామమూర్తి వేషధారణలో అలరించారు. విద్యార్థులు పలు తెలుగు పద్యాలు, గేయాలు, కథలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. గిడుగు రామ్మూర్తి తెలుగు భాషకి చేసిన సేవలను పాఠశాల కరస్పాంటెంట్ పంచశీల శ్రీనివాస్ వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


కవుల వేషధారణలో విద్యార్థులు

విశ్వగురుగా భారత్
మిజోరాం గవర్నర్ హరిబాబు

రాయదుర్గం: భారతదేశాన్ని విశ్వగురువుగా పునఃస్థాపించడానికి ప్రయత్నం సాగుతోందని మిజోరాం గవర్నర్ కె హరిబాబు పేర్కొన్నారు. గురువారం రాత్రి ఖాజాగుడలోని ఓక్రిడ్జ్ అంతర్జాతీయ పాఠశాలలో ఓక్రిడ్జ్ స్కూల్ వ్యవస్థాపకుడు, సీఈఓ నాగతుమ్మల రచించిన 'షామీ దాస్–ది మ్యాన్ హూ సా టుమారో' అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ విద్యా విధానంలోని ముఖ్య లక్షణాలను ఆయన ఎత్తిచూపారు. భారతదేశాన్ని విశ్వ గురువుగా పునర్నిర్మించడానికి అంతర్జాతీయ విద్యను ఉపయోగించుకోవాలని ఈ విధానాన్ని ప్రయత్నిస్తోందన్నారు. నూతన జాతీయ విద్యావిధానం -2020 భారతదేశంలోని విద్యను అంతర్జాతీయీకరిస్తే వికసిత్ భారత్‌కు దారితీస్తుందన్నారు. ప్రతిపాదిస్తోందని ఆయన గుర్తు చేశారు. భారతీయ విద్యారంగానికి షామీదాస్ చేసిన కృషిని ఆయన కొనియాడారు. ఆయన జీవితం, కెరీర్ నిజంగా ఆదర్శప్రాయమైందన్నారు. అనంతరం షామీదాస్ 89వ జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం షామీదాస్, నాగతుమ్మల ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యావేత్తలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పుస్తకావిష్కరణ కార్యక్రమంలో మిజోరం గవర్నర్ హరిబాబు, రచయిత నాగతుమ్మల

గ్లోబల్ టెక్నాలజీ హబ్‌గా హైదరాబాద్



మాట్లాడుతున్న రాష్ట్ర ఐటీ శాఖా ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్

రాయదుర్గం: హైదరాబాద్ నగరం గ్లోబల్ టెక్నాలజీ హబ్‌గా ప్రస్తుతం దృఢంగా స్థిరపడిందని తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్ పేర్కొన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోనిటీహబ్‌లో గురువారం రాత్రి మ్యాథ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ గాలా–2024 అవార్డులతో ఏఐ,ఎంఎల్ నిపుణులను ఘనంగా సత్కరించారు. అనంతరం ప్యానెల్ డిస్కషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 200కి పైగా గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు(జీసీసీ), టెక్నాలజీ కెపాబిలిటీ సెంటర్లు(టీసీసీ)తో హైదరాబాద్ గ్లోబల్ టెక్నాలజీ హబ్‌గా మారడానికి దోహదం చేసిందన్నారు. మ్యాథ్ సీఈఓ రాహుల్‌పైత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

మూసాపేట: కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ హరి గురువారం తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. జగద్గిరిగుట్ట, ఆల్విన్‌కాలనీ, భాగ్యనగర్ కాలనీ, కేపీహెచ్‌బీ, మూసాపేట, బాలానగర్, కూకట్‌పల్లి, బోరబండ, మోతీనగర్ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 9959226151 ఫోన్ నెంబర్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అదే విధంగా మెహదీపట్నం రూట్‌లో 2 మెట్రో డీలక్స్ సర్వీస్‌లను ప్రారంభిస్తున్నామని ఆయన వెల్లడించారు.

రేపు జోనల్‌స్థాయి పోటీలకు ఎంపిక

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ స్థాయి క్రికెట్ పోటీలకు శనివారం కూకట్‌పల్లిలోని జెన్‌సీస్ స్కూల్ గ్రౌండ్‌లో విద్యార్థుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు జోనల్‌స్థాయి క్రీడా కార్యదర్శి బి. యాదయ్య గురువారం తెలిపారు. కూకట్‌పల్లి, బాలానగర్ జోనల్ స్థాయి సెలక్షన్స్‌లో పాల్గొనేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 14 సంవత్సరాల విభాగం, 9,10 తరగతి విద్యార్థులు అండర్ 17లో పాల్గొంటారన్నారు. విద్యార్థులు సరైన పత్రాలతో ఉదయం 9:30 గంటల లోగా హాజరు కావాలని తెలిపారు. జోనల్ క్రీడా కార్యదర్శి బి. యాదయ్య 9949502072, పీడీ రవీందర్ 9985530049 నెంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

మ్యాథ్ ఇన్నోవేషన్ గాలా అవార్డులు ప్రదానం

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో గురువారం రాత్రి మ్యాథ్ ఇన్నోవేషన్ గాలా అవార్డులు–2024 ప్రదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విజేతలకు రాష్ట్ర ఐటీ శాఖా ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్ చేతుల మీదుగా అందించారు. ఈ విజేతలలో యంగెస్ట్ ఏఐ ఎంటర్‌ప్రెన్యూర్ అవార్డు విజేతగా సెట్‌వి స్టార్టప్ రూపకర్తలు వైభవ్, రామ్, రన్నరప్ విజేతలుగా రెండు స్టార్టప్‌లు నిలువగా అందులో సన్‌రైజ్‌మిత్ర స్టార్టప్ రూపకర్త సాయికృష్ణచందా,కుప్పిస్మార్ట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూపకర్త అఖిల్‌కుప్పిరెడ్డి నిలిచారు.

ఇద్దరు హెచ్‌సీయూ ప్రొఫెసర్లకు అవార్డు

రాయదుర్గం: ఇద్దరు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ ఫ్యాకల్టీ ప్రతినిధులు ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు. 'హర్ గోవింద్ ఖోరానా ఇన్నోవేటివ్ యంగ్ బయోటెక్నాలజిస్ట్ అవార్డును హెచ్‌సీయూ ప్రొఫెసర్ డాక్టర్ ఎం శ్యామ్‌లాల్, ప్రొఫెసర్ డాక్టర్ మంజరి కిరణ్‌లు ఈ అవార్డును అందుకున్నారు. యానిమల్ బయాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం శ్యామ్‌లాల్, హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లోని సిస్టమ్స్ అండ్ కంప్యూటేషనల్ బయాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మంజరి కిరణ్‌లకు ఈ అవార్డు పొందారు.

ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు అభినందనీయం


ట్రాఫిక్ సిగ్నల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ రోజాదేవి తదితరులు

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ కాలనీలో సెక్యూరిటీ కమిటీ ఆధ్వర్యంలో రూ.10 లక్షల వ్యయంతో ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థను ఏర్పాటు చేయడం అభినందనీయమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. గురువారం కార్పొరేటర్ మాధవరం రోజాదేవితో కలిసి ప్రధాన కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, వివేకానంద నగర్ సెక్యూరిటీ కమిటీ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, దేవినేని శివరాం ప్రసాద్, నారాయణ రెడ్డి, సత్యనారాయణ, వేణుబాబు, నాయినేని చంద్రకాంత్ రావు, గొట్టిముక్కల పెద్ద భాస్కర్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, రాంచందర్, దుర్గ ప్రసాద్, మేక శివరాం ప్రసాద్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై హైడ్రా కమిషనర్‌కు వినతి

కూకట్‌పల్లి: నియోజకవర్గం పరిధిలో కనుమరుగవుతున్న చెరువులు, నాలాలను పరిరక్షించేందుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పాలనలో స్థానిక ప్రజాప్రతినిధుల అండతో నియోజకవర్గంలో అక్రమ కట్టడాలకు అడ్డూ, అదుపు లేకుండా పోయిందన్నారు. ఆ ఆక్రమణల్లో భీమునికుంట, కాముని చెరువు, రంగధాముని కుంట, సున్నం చెరువు, పరికి చెరువు, నల్ల చెరువు, మైసమ్మ చెరువు, ముళ్లకత్వ చెరువులు కూడా ఉన్నాయని వివరించారు. కై త్లాపూర్ కుంట, ఖాజా కుంట, కూకట్‌పల్లిలో నాలాల సంఖ్య, బాలానగర్‌లో 150 అడుగులు ఉన్న నాలాని పూడ్చి 40 అడుగులు చేశారని ఆరోపించారు. బోయిన్‌పల్లి వద్ద బోయిన్ చెరువులు, నాలాలన్నీ ఆక్రమణలకు గురయ్యాయని, మైసమ్మ చెరువు, రంగనాయక చెరువు సుందరీకరణ పేరుతో కబ్జా చేశారన్నారు. కూకట్‌పల్లి పరిధిలోని చెరువులను పరిశీలించి అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని కోరారు. అదే విధంగా ఆ సమయంలో అనుమతులు ఇచ్చిన అధికారులపై విచారణ జరిపి తక్షణమే చర్యలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ని కోరినట్లు తెలిపారు.


హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సత్యం శ్రీరంగం


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సతీష్‌గౌడ్ తదితరులు

వైభవంగా శ్రీవారి కల్యాణం

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ వేంకటేశ్వర్ నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం శ్రీవారి కల్యాణం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథులుగా పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు పండాల సతీష్‌గౌడ్, రవీందర్ రెడ్డి, మహేందర్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, బీజేపీ నియోజవకర్గ ఇన్‌చార్జి కాంతారావు, నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, ముద్దాపురం కృష్ణగౌడ్, నాగిరెడ్డి, అంబటి శ్రీనివాస్ పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు

పాఠశాలలో స్పోర్ట్స్ మీట్


క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

మూసాపేట: శ్రీహరి నగర్‌లోని కిడ్జీ మౌంట్ లిటేర పాఠశాలలో గురువారం స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. రెండు రోజుల నుంచి విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రావణి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

23వ కల్యాణ మహోత్సవం


పూజలో పాల్గొన్న కార్పొరేటర్ రవీందర్ రెడ్డి తదితరులు

బాలానగర్: బాలానగర్ ఉప్పర సంఘం ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి 23వ కల్యాణ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు డి.కృష్ణమూర్తి, నర్రా దేవేందర్‌రెడ్డి, రాజు సాగర్, లోకేష్ సాగర్, జానకి రాములు సాగర్, రవి సాగర్, గిరి సాగర్, అర్జున్, రాజు, బంగారయ్య, రమేష్, దామోదర్, సాగర్, చక్రవర్తి పాల్గొన్నారు.

చిరంజీవి హాస్పిటల్‌ను ప్రారంభించిన డిప్యూటీ సీఎం


వైద్యులు, యాజమాన్యంతో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ రోడ్డు నెంబర్ వన్‌లో చిరంజీవి హాస్పిటల్‌ను డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క గురువారం ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, నాయకులు సంజీవరావు, మేకల మైఖేల్, అరవింద్‌రెడ్డి, రేష్మ, రాజు, శేషగిరిరావు పాల్గొన్నారు.

వాతావరణ విధ్వంసాన్ని అరికట్టాలి

రాయదుర్గం: వాతావరణ విధ్వంసాన్ని ప్రపంచ దేశాలు అరికట్టేందుకు సమిష్టిగా కృషి చేయాలని రాష్ట్ర పబ్లిక్ హెల్త్ విశ్రాంత చీఫ్ ఇంజనీర్ కొండల్‌రావు సూచించారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్‌కాలేజ్ ఆఫ్ ఇండియాలో సెంటర్ ఫర్ క్లైమేట్ చేంజ్ ఏర్పాటు చేసిన 'కాలుష్య రహిత వాతావరణం కోసం నూతన సదుపాయాల కల్పన' అనే అంశంపై గురువారం జరిగిన వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1757 నుంచే వాతావరణ విధ్వంసం మొదలయ్యిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత 200 ఏళ్ల కాలంలో అధిక మొత్తం లో పారిశ్రామీకరణ, అడవుల నరికివేత, వాహనాల, నీటి కాలుష్యం పెరిగిపోయిందని ఆయన గుర్తు చేశారు. భవిష్యత్తులో మరింత భీకరంగా సంభవించే ముప్పు నుంచి అరికట్టడానికి వినూత్న సాంకేతిక విధానాలు అవసరమన్నారు. ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ ఐఎస్ఎన్‌రాజు తదితరులు మాట్లాడారు.

'మనూ'లో వర్క్‌షాప్


ప్రొఫెసర్ పంకజ్‌అరోరాను సన్మానిస్తున్న దృశ్యం

రాయదుర్గం: ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(ఐటీఈపీ) రూపొందించిన పాఠ్యాంశాలు 'గేమ్‌చేంజర్'గా నిలిచాయని నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్(ఎన్‌సీటీఈ) చైర్మన్ ప్రొఫెసర్ పంకజ్‌అరోరా అభివర్ణించారు. గురువారం గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వ విద్యాలయంలో ఐటీఈపీ, ఎస్ఎంఎంఎస్‌పీఎస్‌టీపై రెండు రోజుల నేషనల్ సెన్సిటైజేషన్ అండ్ ఓరియంటేషన్ వర్క్‌షాప్‌నకుఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుడి మానవతా, సానుభూతి గుణాలు, కేవలం వారి డిగ్రీ కంటే హృదయాలలో శాశ్వత స్థానాన్ని సంపాదించు కుంటాయన్నారు. 'మనూ'వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మియాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని పనిచేస్తుందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శేరిలింగంపల్లి మండల పరిధిలోని కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద 520 లబ్ధిదారులకు ఎమ్మెల్యే గాంధీ కార్పొరేటర్లతో కలిసి చెక్కులను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిరుపేద ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం దేశంలో ఎక్కడా లేని విధంగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం ద్వారా డబ్బులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోందన్నారు.

అనుమతులు లేని డెర్మటాలజీ క్లినిక్ సీజ్

కేపీహెచ్ బీ కాలనీ : అనుమతులు లేకుండా కొనసాగుతున్న డెర్మటాలజీ క్లినిక్ సెంటర్ ను అధికారులు గురువారం రాత్రి సీజ్ చేశారు. కేపీహెచ్ బీ కాలనీ 5వ ఫేజ్ లో బ్రాండ్ ఫ్యాక్టరీ సమీపంలో సూర్య ఎలైట్ మూడవ ఫ్లోర్‌లో అనుమతులకు విరుద్ధంగా నడుస్తున్న డాక్టర్ సుగుణస్ ప్రీమియర్ డెర్మటాలజీ క్లినిక్ ను జిల్లా వైద్యాధికారి డాక్టర్ రఘునాథ్‌స్వామి సీజ్ చేశారు. 11 నెలలుగా ఎటువంటి పత్రాలు లేకుండా చికిత్స చేస్తున్నారన్న సమాచారంతో తనిఖీలు చేసినట్లు వెల్లడించారు. రిజిస్ట్రేషన్ పత్రాల గురించి ఆరా తీయగా.. ఫేక్ డాక్యుమెంట్ ను చూపించడంతో అధికారులు సీజ్ చేశారు. వైద్యాధికారులతో స్థానిక పోలీసులు ఉన్నారు.